క్లుప్తంగా

వెంకన్న ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న అప్పలనాయుడు దంపతులు

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.5 కోట్లతో ఈ పనులు చేస్తున్నారు. దీనిలో భాగంగా మునగపాకకు చెందిన 3వ వార్డు సభ్యుడు బొడ్డేడ అప్పలనాయుడు, లక్ష్మి దంపతులు శుక్రవారం ఆలయ నిర్మాణానికి రూ.10,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో దాడి ముసిలినాయుడు, పాలిమేర కృష్ణ, ఆడారి దానకర్ణ, పెంటకోట ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో వాహన తనిఖీలు

మునగపాక: ప్రతి ఒక్కరూ వాహన రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని ఏఎస్ఐ మన్మథరావు కోరారు. మునగపాక మెయిన్‌రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లపైనా చర్యలు తప్పవన్నారు.

నేడు తోడపెద్దు అచ్చుపోత



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: మండలంలోని నారాయుడుపాలెంలో శనివారం జరగనున్న తోడపెద్దు అచ్చుపోత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే విజయకుమార్ కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోడపెద్దు అచ్చుపోత కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి పరశురామ్, కొయ్య శేషు, చక్రంతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ రైతులకు సత్కారం



ఉత్తమ రైతుల్ని సత్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహక విభాగం ఆధ్వర్యంలో మండలంలోని ఎం.జగన్నాథపురంలో ఐదుగురు ఉత్తమ రైతుల్ని శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ సాగులో ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించాలని సూచించారు. వ్యవసాయ అధికారి శంకర్‌గోవింద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల పంటల దిగుబడిలో నాణ్యత ఉంటుందన్నారు. ఆయా ఉత్పత్తులు ఆహారంగా తీసుకున్న ఎటువంటి హానీ ఉండదని తెలిపారు. సర్పంచ్ కరెడ్ల బుల్లమ్మ, బి.రాంబాబు, వి.నానాజీ తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమంటున్న సూరీడు



నిర్మానుష్యంగా మునగపాక మెయిన్‌రోడ్డు

మునగపాక: సూర్య భగవానుడు భగ్గుమంటున్నాడు. కొద్ది రోజులుగా ఎండల తీవ్రతతో ప్రజలు అల్లాడుతున్నారు. వేడి గాలులు వీయడంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రతకు పిల్లలు, పెద్దలు అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితులు మినహా బయటకు వచ్చేందుకు ఇష్టపడటం లేదు. వ్యవసాయ రైతులు ఉదయం 10 గంటలకే ఇంటి ముఖం పడుతున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకే మునగపాక మెయిన్ రోడ్డు నిర్మానుష్యంగా మారింది. కొంతమంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ ప్రయాణం సాగిస్తున్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

పాయకరావుపేట: పట్టణంలో ప్రభుత్వ ఐటీఐలో 2025 – 26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికిగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు టెన్త్ టీసీ, కుల, ఆధార్, కలర్ ఫొటో, ఈమెయిల్ ఐడీ, ఆధార్‌తో లింకైన ఫోన్ నెంబరుతో ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 26వ తేదీ లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని, లేకుంటే కౌన్సెలింగ్‌కు అనర్హులని తెలిపారు.

బ్రిడ్జి శిథిలం.. వానొస్తే కష్టం!

- ప్రమాదకరంగా నారాయణపురం వంతెన
- కానరాని రక్షణ గోడలు
- వర్షాకాలంలో బ్రిడ్జిపై నుంచి నీరు
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు



బ్రిడ్జికి ఆనుకొని సాగునీటి కాలువలో పడిపోయిన భారీ చెట్టును తొలగించని దృశ్యం

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలం నారాయణపురం వద్ద సాగునీటి కాలువపై శిథిలమైన బ్రిడ్జికి దశాబ్దాలుగా మోక్షం కలగడం లేదు. అచ్యుతాపురం-రాంబిల్లి సెజ్ ప్రారంభమైన తర్వాత వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయం మార్గం ఇది. అయినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు నూతన బ్రిడ్జి నిర్మించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. దాంతో వర్షా కాలంలో వాహన చోదకులు ఇబ్బందులు తప్పడం లేదు.

వర్షాకాలం వస్తే ఇక అంతే...

రాంబిల్లి మండలం నారాయణపురం వద్ద సాగునీటి కాలువపై బ్రిడ్జి శిథిలమైంది. రహదారి మట్టం కంటే ఇది దిగువన ఉండటంతో వర్షాకాలంలో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ గోడలు లేవు. దీంతో ఏమరుపాటుగా వాహనం నడిపినా కాలువలోకి పడిపోయే ప్రమాదముంది. వర్షాలు పడితే బ్రిడ్జిపై నీరు చేరుతుంది. ఆ సమయంలో వాహనాలు వెళ్లాలంటే, నీటి ప్రవాహం తగ్గే వరకూ ఆగాల్సిందే. ఈ బ్రిడ్జిపై గాజువాక నుంచి యలమంచిలి ప్రాంతాలకు వాహనాలు రాకపోకలు ఇటీవల బాగా పెరిగిపోయాయి. విశాఖపట్నం-విజయవాడ రహదారిని చేరుకునేందుకు యలమంచిలి వద్ద అనుసంధానం ఉంది. దీంతో స్టీల్‌ప్లాంట్, అచ్యుతాపురం ప్రాంతీయులు హైవేకు వెళ్లేందుకు యలమంచిలి మార్గాన్ని ఎన్నుకుంటారు. దీంతో ఈ మార్గంలో ఉన్న బ్రిడ్జి ఎత్తును పెంచి నిర్మించాల్సి ఉంది.



రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారిన నారాయణపురం బ్రిడ్జి

ప్రస్తుతం చాలా కీలకం...

అచ్యుతాపురం–అనకాపల్లి రహదారి విస్తరణ పనులు ప్రారంభించారు. ఈ మార్గంలో రెండు చోట్ల బ్రిడ్జిలు, ఒక ఫ్లైఓవర్‌ను నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. మరోవైపు రోడ్డు విస్తరణ పనులు ఊపందుకుంటే ప్రత్యామ్నాయ మార్గాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. తద్వారా అచ్యుతాపురం–యలమంచిలి రోడ్డుకు తాకిడి పెరగనుంది. జూన్ నుంచి వర్షాకాలం ప్రారంభం కావడంతో ఇప్పటికే నారాయణపురం బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

కాలువ నిర్వహణ అధ్వానం..

వర్షాకాలంలో బ్రిడ్జి దిగువలో సాగునీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ ప్రవాహం వచ్చే ఎగువ ప్రాంతంలో భారీ చెట్టు పడిపోయి సాగునీటి కాలువకు అడ్డంగా ఉంది. ఆర్అండ్‌బీ శాఖ అధికారుల ద్వారా ఈ సమాచారాన్ని సేకరించి జలవనరుల శాఖ అధికారులు ఇప్పటికే చెట్టును తొలగించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. అధికంగా వరి పండించే రాంబిల్లి మండలంలో ఇటువంటి కాలువల నిర్వహణలో కనబరుస్తున్న నిర్లక్ష్యం ఇటు వాహన చోదకులకు, అటు రైతులకు శాపంగా మారింది.

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు

నారాయణపురం బ్రిడ్జి వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశాం. రూ.2.93 కోట్లు అవసరమని ప్రతిపాదించాం. ప్రస్తుతం ఉన్న మట్టం కంటే మరో మీటరు ఎత్తులో నిర్మించాలని భావిస్తున్నాం.

–సత్యవేణి, జేఈ, ఆర్అండ్‌బీ

రూ.20 లక్షల బీమా చెక్కు అందజేత

పాయకరావుపేట: మండలంలోని పాల్తేరు గ్రామానికి చెందిన కొంకిపూడి నాగేశ్వరరావు కుటుంబానికి ప్రమాద బీమా నుంచి రూ.20 లక్షలు మంజూరైంది. 2023 డిసెంబరు 29న కందిపూడి చెరువు వద్ద భారీ క్రేన్ ఢీకొన్న ప్రమాదంలో అతడు మృతి చెందాడు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో అకౌంట్ కలిగిన ఉన్న అతను ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌లో వెయ్యి రూపాయలతో ప్రమాద బీమా పాలసీ తీసుకున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మరణించడంతో శుక్రవారం బ్యాంకు శాఖలో నాగేశ్వరరావు భార్య పద్మావతికి రూ.20 లక్షల చెక్కును అనకాపల్లి రీజనల్ మేనేజర్ ఎస్.సతీష్ చంద్ర అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఏరియా మేనేజర్ జి.సురేష్‌బాబు, అనకాపల్లి జిల్లా నోడల్ ఆఫీసర్ ఎం.మోహన్ రెడ్డి, బ్రాంచి మేనేజర్ ఎన్. రాజ్‌కుమార్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. 132 కేవీ సబ్ స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్పు కారణంగా ఎస్.రాయవరం, యలమంచిలి, నక్కపల్లి మండలాల్లో త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో మార్పు ఉంటుందని చెప్పారు. ఉదయం 5 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ విభాగ ప్రతినిధి రమ్య

మునగపాక: బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ అరికట్టాలని జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి కేఎల్‌వీ రమ్య కోరారు. శుక్రవారం రాజుపేటలో బాలల సంరక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిటీ సభ్యులు బాధ్యతగా పనిచేసి బాల్య వివాహాల కట్టడికి కృషి చేయాలన్నారు. బాలికలపై లైగింక వేధింపులు లేకుండా చూడాలన్నారు. బాల కార్మికులతో ఎక్కడైనా పనులు చేయిస్తే చర్యలు తీసుకునేలా పాటుపడాలన్నారు. సర్పంచ్ కిలాడి దేముడు, కార్యదర్శి ఎస్తేర్, ఏఎన్ఎం టి.జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి, మహిళా పోలీసు జ్యోతిర్మయి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దారుణ దారులకు మోక్షం లేదా?



అధ్వానంగా అన్నవరం రహదారి

కోటవురట్ల: అధ్వాన రహదారులు వాహనదారులకు ఇక్కట్లు పెడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా రహదారులకు మోక్షం కలగలేదు. ఎన్నికల ముందు రహదారులను అభివృద్ధి చేస్తామని వాగ్దానాలతో ఆ పార్టీ నాయకులు హడావుడి చేశారు. ఇంకేముంది రహదారులన్నీ అద్దంలా మెరిసిపోతాయని జనాలు నమ్మేశారు. మండలంలో రామచంద్రపురం జంక్షన్ నుంచి ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు వరకు, కైలాసపట్నం నుంచి రాజుపేట, యండపల్లి జంక్షన్ నుంచి అన్నవరం మీదుగా నర్సీపట్నం మండలం వేములపూడి వెళ్లే రహదారులు దారుణంగా ఉన్నాయి. పెద్ద గోతులు పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇచ్చిన హామీ మేరకు వీటిని అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పట్టపగలే గ్రావెల్ తవ్వకాలు

- చోద్యం చూస్తున్న అధికారులు



పాటిపల్లి కేజీబీవీ సమీపంలో పొక్లెయిన్‌తో గ్రావెల్ తవ్వుతున్న దృశ్యం

మునగపాక: అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఉక్కుపాదం మోపుతున్నామంటూ అధికారులు ఊకదంపుడు ప్రచారం చేస్తున్నారు. ఇందుకు భిన్నంగా క్షేత్రస్థాయిలో పరిస్థితి ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక అక్రమ గ్రావెల్ తవ్వకాలు ఊపందుకున్నాయి. నిరోధించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ పట్టపగలే గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నా, స్థానిక రెవెన్యూ, మైన్స్, పోలీసు యంత్రాంగం ఎందుకు స్పందించడం లేదంటూ బాహాటంగా ప్రశ్నిస్తున్నారు. తాజాగా మండలంలోని పాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి వెళ్లే దారిలో పొక్లెయిన్ సాయంతో పట్టపగలే గ్రావెల్ తవ్వుతున్నారు. ఇక్కడకు కూతవేటు దూరంలో ఉన్న అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. ఇలా కొండలను పిండేస్తున్నా అధికారుల ఉదాసీనత వైఖరిపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అక్రమార్జనకు తెరతీసే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై డీటీ శేషుబాబును ఫోన్‌లో సంప్రదించగా గ్రావెల్ తవ్వుతున్న విషయం తన దృష్టికి రాలేదని స్థానిక వీఆర్వోను పంపి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

22 నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు



నాటిక పోటీల కర పత్రాల ఆవిష్కరణ

కశింకోట: స్థానిక గవరపేటలో ఈ నెల 22 నుంచి నాలుగు రోజులపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి దేవినాయుడు తెలిపారు. హనుమజ్జయంతి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 10 నాటికలను ఎంపిక చేసి ప్రదర్శనకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ నెల 22న రాత్రి 9 గంటలకు స్థానిక గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద విశాఖపట్నం తెలుగు కళా సమితికి చెందిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' నాటిక, అదే రోజు రాత్రి 10.15 గంటలకు కాకినాడకు చెందిన బీవీకే క్రియేషన్స్ వారి తితిక్ష నాటిక, 23న రాత్రి 8.45 గంటలకు కరీంనగర్ చైతన్య కళా భారతి బృందంతో చీకటి పువ్వు, రాత్రి 10 గంటలకు గుంటూరులోని అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ వారి 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక, 11.15 గంటలకు విజయవాడ గురజాడ కళా మందిర్ వారి మహా ప్రస్థానం నాటిక, 24న రాత్రి 8.45 గంటలకు హైదరాబాద్‌లోని గోవాడ క్రియేషన్స్ వారి మూల్యం, 10 గంటలకు కొలకలూరులోని సాయి ఆర్ట్స్ వారి జనరల్ బోగీలు, 11.15కు పెందుర్తి నటరాజ డ్రమెటిక్ అసోసియేషన్ వారి 'శిథిల జీవి', 25న రాత్రి 9 గంటలకు గుడివాడ కృష్ణా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వారి 'ద్వార బంధాలు చంద్రయ్యనాయుడు' చారిత్రక నాటకం, 10.15 గంటలకు విశాఖపట్నం జ్యోతి సరళ స్మారక కళా పరిషత్ వారి 'అనగనగా ఒక రాజు' నాటికను ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

రోడ్డు సర్వే అడ్డుకున్న రైతులు



అధికారుల సర్వేను అడ్డుకున్న రైతులు

అచ్యుతాపురం రూరల్: తమ భూములకు నోటీసులు ఇచ్చి, రేటు నిర్ణయించాకే సర్వే చేయాలని దొప్పెర్ల రెవెన్యూ పరిధి రావిపాలెం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బార్క్ రోడ్డు నుంచి మేకరాశి కొండ వరకూ ఏర్పాటు చేయదలచిన 60 అడుగుల మేర రహదారి పనులను అడ్డుకున్నారు. రైతులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా భూముల్లోకి రెవెన్యూ అధికారులు చొరబడటంపై తీవ్రంగా వ్యతిరేకించారు. తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి రైతులతో చర్చించి వారి అనుమతితో భూముల్లో సర్వేలు నిర్వహించాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సర్వసిద్ధి పీహెచ్‌సీలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పెనుగొల్లు అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది



మూలపేటలో జాతీయ డెంగ్యూ దినోత్సవ ర్యాలీ

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి కోరారు. జాతీయ డెంగ్యూ దినోత్సవంలో భాగంగా శుక్రవారం ఆమె మూలపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందడం ద్వారా డెంగ్యూ సోకుతుందన్నారు. ఇంటి ఆవరణలో నీటి నిలువలు లేకుండా చూడాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడే అమలు చేయాలన్నారు. సీహెచ్‌వో దేవకాంత, వైద్య సిబ్బంది, ఆడారి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: దోమల నివారణపై దృష్టి సారించి ప్రతి ఒక్కరూ వ్యాధులకు దూరంగా ఉండాలని వైద్యాధికారి ఎస్ వాసంతి తెలిపారు. జాతీయ డెంగ్యూ డే పురస్కరించుకుని శుక్రవారం సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ దోమల వ్యాప్తి వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన పెంచుకుని, వాటి వృద్ధిని అరికట్టాలన్నారు. వీధుల్లో పంచాయతీ సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుధ్య సమస్య తలెత్తకుండా, మురుగు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పెనుగొల్లు పీహెచ్‌సీలో వైద్యాధికారి రాజేశ్వరి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పీహెచ్ఎన్ ఎం.రత్నసఖి, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ఎస్.వి. ప్రకాష్, హెల్త్ అసిస్టెంట్ బి. ప్రేమ్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైనికోద్యోగుల కుటుంబాలకు సత్కారం నేడు

యలమంచిలి రూరల్: త్రివిధ దళాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల కుటుంబాలకు సత్కార కార్యక్రమం మున్సిపాలిటీలో శనివారం నిర్వహించనున్నామని, దీన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా విజయవంతం చేయాలని చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో పట్టణానికి చెందిన సీనియర్ సిటిజన్లు, వ్యాపార, వర్తక, ప్రజా సంఘాల వారుతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ పరిధిలో త్రివిధ దళాల్లో పనిచేస్తున్న 283 మంది కుటుంబాలు ఉన్నాయన్నారు. శనివారం ఉదయం మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి సైనికోద్యోగుల ఇళ్లకు వెళ్లి ఉద్యోగి తల్లిదండ్రులను సత్కరించేలా 6 బృందాలతో కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ప్రతి సైనికోద్యోగి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేస్తామన్నారు. దేశాన్ని, దేశ ప్రజల ప్రాణాలను నిరంతరం కాపాడుతున్న సైనికోద్యోగుల సేవలు వెలకట్టలేనివని ఆమె అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తం



వారపు సంతలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



నినాదాలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అచ్యుతాపురం రూరల్: ప్రాణాంతకమైన డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావ్య తెలిపారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అచ్యుతాపురం వారపు సంతలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధిని తరిమి కొట్టేందుకు మూడు సూత్రాలు పాటించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ, నీటి నిల్వలు లేకుండా సరిచూసుకోవాలని, వాడుక నీరు నిల్వలపై తప్పనిసరిగా మూత పెట్టుకోవాలన్నారు. అలా చేయడం వల్ల దోమ నీటి నిల్వలపై వాలి గుడ్లు పెట్టే అవకాశం ఉండదన్నారు. తద్వారా దోమలు ప్రత్యుత్పత్తి అయ్యే అవకాశం ఉండదన్నారు. డెంగ్యూ వ్యాధి సోకిన వారికి అధిక జ్వరం, తలనొప్పి, దద్దుర్లు, కీళ్ల నొప్పులు రావడం, వికారంగా ఉండటం, వాంతులు వంటి సూచనలు కలిగినప్పుడు వెంటనే స్థానిక పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ వరలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ గీత, హెచ్ఎస్ సన్యాసిరావు, ఆరోగ్య సహాయకులు ఎల్.అప్పలకొండ, ఆశా, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

హై ఓల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

కశింకోట: గవరపేటలో శుక్రవారం ఉదయం అకస్మాత్తుగా హై ఓల్టేజీతో విద్యుత్ సరఫరా కావడంతో పలు ఇళ్లలో టీవీ, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, ఇతర విద్యుత్ ఉపకరణాలు కాలిపోయాయి. దీంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా ప్రకటించిన మేరకు మరమ్మతుల నిమిత్తం ఉదయం 10 గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఈ సమయంలో విద్యుత్ హెచ్చు, తగ్గులతో సరఫరా కావడంతో ఉపకరణాలు కాలిపోయాయని స్థానికులు వాపోయారు. కొందరి ఇళ్లలో నిప్పులు వచ్చి భయాందోళనకు గురి చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎక్కువ సమయం విద్యుత్ వినియోగించడానికి స్థానికులు భయానికి గురయ్యారు. ఇదిలా ఉండగా శుక్రవారం తరచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ప్రజలు ఇబ్బంది వడ్డారు.

ఎన్నికల హామీని అమలు చేయాలి



నెహ్రూ చౌక్‌లో సీహెచ్‌వోల మానవహారం

అనకాపల్లి: గ్రామాల్లో ఆరేళ్లుగా విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్‌వో) సమస్యలు పరిష్కరించాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నేటి వరకూ అమలు చేయలేదని రాష్ట్ర గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వి.వి. శ్రీనివాసరావు తెలిపారు. సీహెచ్‌వోల సమ్మె శుక్రవారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీలు నిర్వహించి నెహ్రూ చౌక్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరికి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని వాపోయారు. సమాన పనికి సమాన వేతనం, జాబ్‌చార్ట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీహెచ్‌వోలు భవాని, సంధ్య, నూకలమ్మ, దేవి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రక్షించిన పెందుర్తి పోలీసులు

పెందుర్తి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. మంచినీటి పథకం వాటర్ ట్యాంక్ ఎక్కి దూకేందుకు సిద్ధమయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని, అతడ్ని రక్షించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పెందుర్తి మండలం జంగాలపాలెం వద్ద శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన బోని సత్యం(60)కు భార్య, కుమార్తె, అల్లుడితో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం మరోసారి వీరి మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. దీంతో చింతలపాలెనికి సమీపంలోని జంగాలపాలెంలో వాటర్ ట్యాంక్ ఎక్కి దూకడానికి సిద్ధమయ్యాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాలతో సమీపంలోనే ఉన్న బ్లూకోట్స్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ హుటాహుటిన అక్కడకు వెళ్లి, సత్యంను చాకచక్యంగా కిందికి దించేలా చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. బంధువులకు అప్పగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.